

సోమశిలలో 35.603 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 35.603 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 93.196 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,690
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,540
3 శాతం జీఎస్టీతో..	రూ.5,706
నవర (8 గ్రా)	రూ.45,648

గరిష్టం/కనిష్టం 42.0 /31.3

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 47 శాతం ఉంది. బుధవారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. వేడి గాలులు వీస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

- ఈ నెల 15న కౌన్సెలింగ్

నెల్లూరు(పొగతోట): పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి మొత్తం 205 మంది దరఖాస్తు చేసుకున్నారని డీపీఓ సుస్మితారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 665 సచివాలయాల్లో పనిచేస్తున్న 205 మంది పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీన బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి ఉపాధి అధికారి ఎంసీహెచ్ భవానీశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్ట్ ఫైబర్ నెట్, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, పాపులర్ షూమార్ట్ తదితర కంపెనీల్లో నెట్‌వర్క్ ఇంజినీర్లు, అసిస్టెంట్ మేనేజర్, సేల్స్ మేనేజర్, బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్‌మెన్, సేల్స్ గర్ల్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ చదివిన వారు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు స్థానిక ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగిన దృష్ట్యా ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 445 మెగావాట్లు, 2వ యూనిట్లో 400 మెగావాట్లు, 3వ యూనిట్లో 555 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుపుతున్నామని తెలిపారు.

19న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 19వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. 19న ఉదయం 10.30 గంటలకు 2వ స్థాయీ సంఘం, 11.30 గంటలకు 3వ, మధ్యాహ్నం 2 గంటలకు 4వ, 2.45 గంటలకు 5వ, 3.30 గంటలకు 5వ, సాయంత్రం 4.15 గంటలకు 1, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాలకు జెడ్పీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 46 మండలాల్లో ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్స్(పీటీఐ) (ఆర్ట్, వర్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్) సిబ్బంది రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత దరఖాస్తులో వివరాలు నమోదు చేసి సర్వీస్ సర్టిఫికెట్, పీహెచ్‌సీ, స్పౌస్ తదితర పత్రాలను ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల హెచ్‌ఎంతో ధ్రువీకరణ చేయించి ఈ నెల 17 లోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో స్వయంగా అందజేయాలని తెలిపారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పెంచలయ్య సూచించారు. నెల్లూరుతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు తదితర పట్టణాల్లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగే రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ నిర్లక్ష్యం జగన్ సంపూర్ణం



మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్

లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించి అన్నదాత ముఖాల్లో ఆనందం చూడాలనే సంకల్పంతో దివంగత నేత వైఎస్సార్ సంగం బ్యారేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వివిధ కారణాలతో బ్యారేజ్ నిర్మాణ పనులపై నిర్లక్ష్యం చూపాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక తండ్రి ఆశయాన్ని నెరవేరుస్తూ రైతులకు అవసరమైన మేర సాగునీరందించాలనే లక్ష్యంతో సంగం బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేసి రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

వైఎస్సార్ హయాంలో శంకుస్థాపన

- అనంతరం నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు
- ప్లాన్, డిజైన్ల మార్పుల పేరుతో టీడీపీ కాలయాపన
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నిర్మాణం పూర్తి
- 5 లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందజేత



సంగం బ్యారేజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి(ఫైల్)

సంగం: రైతులకు ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారు. వీరి కృషి ఫలితంగానే సంగం వద్ద మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ నిర్మితమై రైతుల పొలాలకు సాగునీరు అందుతుండడంతో వారి ఆనందానికి అవధులు లేవు. 2004వ సంవత్సరంలో సంగంకు వచ్చిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు సంగం వద్ద పెన్నానదిపై నిర్మించిన ఆనకట్ట శిథిలమైందని, బ్యారేజ్‌ను నిర్మించాలని విన్నవించారు. అప్పటికే ఉన్న పాత ఆనకట్టను నిర్మించి 125 సంవత్సరాలు దాటడంతో ప్రమాదకరంగా తయారైంది. ఆనకట్ట దెబ్బతింటే లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడతారని గ్రహించిన ఆయన 2006లో సంగం వద్ద రూ.90 కోట్ల నిర్మాణ వ్యయంతో నూతన బ్యారేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి శంకుస్థాపన చేశారు. మొదట్లో బ్యారేజ్ నిర్మాణం గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టకపోవడంతో వైఎస్సార్ అధికారులతో చర్చించి 2008లో బ్యారేజ్ నిర్మాణ వ్యయాన్ని రూ.110 కోట్లకు పెంచి మరో సంస్థకు పనులు అప్పగించారు. దీంతో నూతన బ్యారేజ్ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. 2009లో వైఎస్సార్ అకాల మృతితో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సంగం బ్యారేజ్ నిర్మాణంపై శీతకన్ను వేయడంతో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చెందారు.

టీడీపీ హయాంలో కాలయాపన

2009లో వైఎస్సార్ మృతి అనంతరం వచ్చిన ముఖ్యమంత్రులు బ్యారేజ్ నిర్మాణంపై సక్రమంగా దృష్టి సారించలేదు. దీంతో పనులు నత్తనడకన సాగాయి. తదుపరి 2014లో ఏర్పాటైన తెలుగుదేశం ప్రభుత్వం సైతం బ్యారేజ్ నిర్మాణం పూర్తయితే జిల్లాలోని 6 నియోజకవర్గాల్లోని అన్నదాతల దృష్టిలో వైఎస్సార్ దేవుడవుతారనే భయంతో పనులు సక్రమంగా జరగకుండా ప్లాన్, డిజైన్ల మార్పుల పేరుతో కాలయాపన చేసింది. దీంతో బ్యారేజ్ నిర్మాణం ఇక జరగదని రైతులు భావించారు.



సంగం పాత ఆనకట్ట

హామీ ఇచ్చి.. ధైర్యం నింపి..

ప్రజాసంకల్పయాత్రలో భాగంగా అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంగం వచ్చి అసంపూర్తిగా ఉన్న బ్యారేజ్ నిర్మాణ పనులను పరిశీలించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే త్వరగా బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గ సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర చేసిన వైఎస్సార్‌సీపీ నేత మేకపాటి గౌతమ్‌రెడ్డి సైతం సంగం బ్యారేజ్‌ను తమ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనుల పరుగులు

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన బ్యారేజ్ నిర్మాణ పనులు పరుగులు పెట్టాయి. తన తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను, కాంట్రాక్ట్ సంస్థలను సమన్వయపరిచి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ బ్యారేజ్ నిర్మాణ పనులను వేగవంతం చేశారు. అంతేకాకుండా 850 మీటర్లు ఉన్న బ్యారేజ్‌ను 1185 మీటర్లకు పైగా పెంచి రూ.340 కోట్ల వ్యయంతో నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. అప్పటి ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి సైతం ఆత్మకూరు తన నియోజకవర్గం కావడంతో సంగం బ్యారేజ్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు పూనుకున్నారు. ఇరిగేషన్‌శాఖ మంత్రిగా ఉన్న పి.అనిల్‌కుమార్‌యాదవ్ సైతం బ్యారేజ్‌ను పరిశీలించి పనులు వేగవంతం చేశారు. తండ్రి వైఎస్సార్ ఇచ్చిన మాటను కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తూ బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఈ సమయంలో ఐటీ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాన్మరణంతో సంగం బ్యారేజ్‌కు ఆయన పేరు పెడుతూ 2022 సెప్టెంబర్ 6వ తేదీన బ్యారేజ్‌ను ప్రారంభించి స్నేహధర్మాన్ని సైతం చాటుకున్నారు.

ఆనందంలో అన్నదాతలు

నూతన బ్యారేజ్‌ను ప్రారంభించిన తరువాత రెండు పంటలు పండించుకుంటున్న అన్నదాతల్లో ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలోని ఆత్మకూరు, సర్వేపల్లి, కావలి, నెల్లూరు, నెల్లూరురూరల్, కోవూరు నియోజకవర్గాల్లో 5 లక్షల ఎకరాలకు పైగా అధికార ఆయకట్టు రైతులకు, అనధికారికంగా మరో లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టుకు నూతన బ్యారేజ్ ద్వారా సాగునీటి సరఫరా జరుగుతోంది. కావలి, నెల్లూరు పట్టణ ప్రజలకు తాగునీరు సైతం ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నారు. దీంతోపాటు బ్యారేజ్ వద్ద 0.5 టీఎంసీల నీరు నిల్వ ఉండడంతో భూగర్భ జలాలు పెరిగి సంగం ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యలు తొలగిపోయాయని రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అపర భగీరథుడు వైఎస్సార్



సంగం వద్ద పాత ఆనకట్ట శిథిలావస్థకు చేరడంతో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నూతన బ్యారేజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మా ప్రాంతానికి నీరందించేలా కృషి చేసిన అపర భగీరథుడు. ఎన్ని ప్రభుత్వాలు మారినా బ్యారేజ్ నిర్మాణాన్ని ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారు.

– మెట్టుకూరు వాసుదేవరెడ్డి, సంగం

రుణపడి ఉన్నారు



సంగం బ్యారేజ్‌కు శంకుస్థాపన చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డికి, బ్యారేజ్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా రైతాంగం, ప్రజలు రుణపడి ఉన్నారు. 5 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుండడం చాలా సంతోషకరం.

– పులగం శంకర్‌రెడ్డి, అన్నారెడ్డిపాళెం, సంగం

రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు

మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ వల్ల జిల్లాలోని 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. పాత ఆనకట్ట శిథిలమైన సమయంలో సాగునీరు అందించాలంటే ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలు వేసి నీరు సరఫరా పరిస్థితి ఉండేది. ప్రస్తుతం బ్యారేజ్ నిర్మాణం పూర్తి కావడం వల్ల జిల్లాలోని రైతాంగానికి పూర్తిగా సాగునీరు, అవసరమైన చోట్ల తాగునీటిని సైతం అందిస్తున్నాం.

– మేకల అనిల్‌కుమార్‌రెడ్డి, ఈఈ, సంగం బ్యారేజి

ప్రజల చెంతకే పాలన

గతంలో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమైన దాఖలాలు లేవు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందాలంటే కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. సచివాలయాల ద్వారా ఆయా గ్రామాల్లోనే ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పిడూరులో ప్రజలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్(ఫైల్)

- సమస్య ఎక్కడో అక్కడే పరిష్కారం
- పైలట్ ప్రాజెక్ట్‌గా పిడూరు
- ప్రజలకు అవసరమైన అన్ని సర్టిఫికెట్లు సచివాలయంలోనే అందజేత

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఆయా గ్రామాల్లోనే అందించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మనుబోలు మండలం పిడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఆ గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి అవసరమైన సర్టిఫికెట్లను మంజూరు చేశారు. సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 424 మంది హాజరయ్యారు. వారి నుంచి 842 అర్జీలను అధికారులు స్వీకరించారు. కుల ధ్రువీకరణకు 344, ఆదాయ ధ్రువీకరణకు 349, ఆధార్ కోసం 140, మ్యారేజ్ సర్టిఫికెట్‌కు 5, భూసమస్యల పరిష్కారానికి 4 దరఖాస్తులు వచ్చాయి. 140 ఆధార్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఆధార్‌కు ఫోన్ లింక్ తదితర సమస్యలను పూర్తిచేశారు. సర్టిఫికెట్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి 695 ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందజేశారు. 7 సర్టిఫికెట్ల సమస్యలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా ప్రజల వద్ద పూర్తిస్థాయిలో డాక్యుమెంట్లు లేకపోవడం వల్ల పెండింగ్‌లో ఉన్నాయి.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి


కలెక్టర్ ఎం.హరినారాయణన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను పరిశీలించారు. టెలీకాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించే సమయంలో ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాని మండలస్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అందులో భాగంగా మనుబోలు మండలం పిడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా స్వీకరించారు. ప్రజలకు అవసరమైన అన్ని సర్టిఫికెట్లను అక్కడే అందించి సమస్యలు పరిష్కరించారు.

అన్ని సచివాలయాల్లో..

పిడూరు సచివాలయ పరిధిలో జిల్లా యంత్రాంగం చేపట్టిన కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ కార్యక్రమాన్ని అన్ని సచివాలయల పరిధిలో అమలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టనుంది. మండలాల వారీగా సచివాలయాలను ఎంపిక చేసి సర్టిఫికెట్ల సమస్యలను పరిష్కరించనున్నారు.



ఈమె పేరు ఓడూరు లక్ష్మమ్మ, మనుబోలు మండలం పిడూరు గ్రామం. సుమారు ఏడాది క్రితం ఈమె భర్త చనిపోయాడు. భర్త చనిపోవడానికి కొంతకాలం ముందు ఆమె నగలు బ్యాంకులో ఉంచి రుణం తీసుకున్నాడు. నగలు తిరిగి తీసుకోవాలంటే ఆధార్, రేషన్, బ్యాంకు పత్రాలతోపాటు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా కావాలన్నారు. ఇటీవల పిడూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంప్‌లో తనకు అవసరమైన సర్టిఫికెట్లను ఇవ్వడంతో లక్ష్మమ్మ సమస్య పరిష్కారమైంది.



ఈమె పేరు మునుకూరు కవిత, వ్యవసాయ కుటుంబం. ఈబీసీ నేస్తం కోసం ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్‌లు అవసరం కావడంతో కొంతకాలంగా ప్రయత్నం చేసింది. అయితే రకరకాల కారణలతో ఆలస్యం అయింది. ఇటీవల పిడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఒకే రోజులో అందజేయాలని అధికారులు నిర్ణయించడంతో కవితకు అవసరమైన ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్లు అందాయి.

సర్టిఫికెట్లు అందించాం



కలెక్టర్ ఆదేశాలతో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. మనుబోలు మండలం పిడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సర్టిఫికెట్లు అందించాం.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

సోమిరెడ్డి జిమ్మిక్కులు

- టికెట్ కోసం నానా పాట్లు
- వద్దని అంటున్నా కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటన
- వరుసగా ఓడిన వారికి టికెట్ లేదని చెప్పిన చినబాబు
- దిక్కుతోచని స్థితిలో సీనియర్ నేత

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకులపై పార్టీ బలం పెంచాలంటూ ఒత్తిడి చేస్తుండడంతో వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు బలవంతంగా ఆ పార్టీ కండువాలు వేస్తూ ఫొటోలకు ఫోజులిస్తున్నాడు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి దారుణంగా ఉన్న క్రమంలో ఆ పార్టీ కార్యక్రమాలకు నలుగురిని పిలిచినా వచ్చే పరిస్థితి లేదు. అంతకంటే ముందు ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి సోమిరెడ్డి గ్రాఫ్ పాతాళానికి పడిపోయింది. ఇప్పటికే ఆ పార్టీ నేత చినబాబు 'వరుసగా మూడుసార్లు ఓడిపోయిన వాళ్లకు ఈ దఫా టికెట్ లేదని' ప్రకటించడంతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ రావడంపై అనుమానాలు ఉండగా సరికొత్త డ్రామాకు తెర తీశాడు. ఇప్పటికే మండలస్థాయిలోని ద్వితీయ శ్రేణి నాయకులపై రోజు పక్క పార్టీల నుంచి జనం టీడీపీలో చేరుతున్నట్లు చేయాలని ఒత్తిడి పెంచారు.

అభిమానులను అద్దెకు తీసుకువచ్చి..

వెంకటాచలంలో మండలం టీడీపీ నాయకుల మధ్య అంతర్గతపోరు కొనసాగుతోంది. ఆ పార్టీ నాయకులు సోమిరెడ్డి వద్ద మెప్పు పొందేందుకు బయట నియోజకవర్గాల నుంచి అభిమానులను అద్దెకు తీసుకువచ్చి వెంకటాచలం మండలానికి సంబంధించిన వ్యక్తులుగా పరిచయం చేసి కండువాలు కప్పి టీడీపీలో చేరినట్లు చెప్పుకుంటున్నారు. గత ఏప్రిల్‌లో వెంకటాచలం వడ్డిపాళెనికి చెందిన రాజేంద్ర ఆధ్వర్యంలో వెంకటాచలంలో కార్యక్రమం నిర్వహించి నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలకు చెందిన ఓటర్లు వందల మంది టీడీపీలో చేరినట్లుగా సోమిరెడ్డి ప్రకటించి నవ్వుల పాలయ్యారు. తాజాగా వెంకటాచలం మండలం కాకుటూరులో కొందరికి బలవంతంగా పార్టీ కండువాలు కప్పి వారంతా టీడీపీలో చేరినట్లు ప్రకటించుకుని ఫొటోలకు ఫోజులిచ్చాడు. వెంటనే వారంతా వైఎస్సార్‌సీపీ నేత వెంకటశేషయ్య వద్దకు వెళ్లి తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని, సోమిరెడ్డి బలవంతంగా కండువాలు వేశాడని తెలిపారు. ఇలా మరోసారి సోమిరెడ్డి నవ్వుల పాలయ్యాడు.



నెల్లూరురూరల్ ఓటర్లకు వెంకటాచలం మండలంలో టీడీపీ కండువాలు కప్పిన సోమిరెడ్డి(ఫైల్)

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

- ప్రథమ సంవత్సరంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానం
- ద్వితీయ సంవత్సరంలో తృతీయ స్థానం

నెల్లూరు(టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. విజయవాడలో మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు జరిగాయి. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 24,932 మంది విద్యార్థులు హాజరు కాగా 20,967 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా 84.10 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో నెల్లూరు జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 22,576 మంది విద్యార్థులు హాజరు కాగా 19,846 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా 87.91 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో నెల్లూరు జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది.

బిట్రగుంటలో ఏడీఆర్ఎం తనిఖీలు

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్‌ను విజయవాడ రైల్వే డివిజనల్ ఏడీఆర్ఎం శ్రీకాంత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ కార్యాలయం, క్రూ లాబీ విభాగంతోపాటు పలు ఇతర విభాగాలను చూసి సిబ్బంది పనితీరును సమీక్షించారు. అనంతరం వివిధ సెక్షన్ల ఇంజినీర్లతో ఏర్పాటు చేసిన భద్రతా సెమినార్‌లో పాల్గొని పలు సూచనలిచ్చారు. ఒడిశాలో ఇటీవల జరిగిన రైలు ప్రమాదాన్ని ఉదహరిస్తూ సిగ్నలింగ్, ఇతర సెక్షన్లకు చెందిన అధికారులు ప్రమాదాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రాణాలను కాపాడుతూ..

- రక్తదానం.. మనమూ చేద్దాం
- జిల్లాలో పెరుగుతున్న దాతలు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రక్తదానం.. ఇది ప్రాణాలను నిలబెడుతుంది. ప్రతి మనిషికి ఏదో ఒక సందర్భంలో రక్తం ఎక్కించాల్సి వస్తుంది. ఒక్కోసారి కొన్ని గ్రూపులకు చెందిన రక్తం అందుబాటులో ఉండక ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రక్తం ప్రాధాన్యతను తెలిపేందుకు, రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

108 సార్లు



మధుసూదన్‌రావు అనే వ్యక్తి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ మోటివేటర్‌గా ఉన్నారు. రక్తదానంపై అపోహలు తొలగిస్తూ క్యాంప్‌లు నిర్వహిస్తుంటారు. ఆయన ఇప్పటి వరకు 108 సార్లు రక్తదానం చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

98 సార్లు



చంద్రగిరి అజయ్‌బాబు అనే వ్యక్తి ఉపాధ్యాయుడు. పాఠశాల ముగిసిన వెంటనే రెడ్‌క్రాస్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా సేవలందిస్తారు. ఇప్పటి వరకు 98 సార్లు రక్తదానం చేశారు. ఆయన సేవలను పరిశీలించిన రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ బాధ్యతలు అప్పజెప్పారు.

89 సార్లు



లేబూరు గ్రామానికి చెందిన పలగాని కిరణ్‌కుమార్‌రెడ్డి డెయిరీ ఫాం నడుపుతున్నారు. ఇప్పటి వరకు 89 సార్లు రక్తదానం చేశారు. పత్రికల్లో వచ్చే వార్తలను పరిశీలిస్తూ రక్తదానంపై అవగాహన పెంచుకున్నానని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.

నెల్లూరు(అర్బన్): రక్తదానం చేయడం వల్ల ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపొచ్చు. అందుకే దీనిని మహాదానమంటారు. రక్తదానం చేసే వాళ్లని ప్రాణదాతలని పిలుస్తుంటారు. ఎవరికైనా తీవ్ర రక్తహీనత ఉన్నప్పుడు లేదా అత్యవసర ఆపరేషన్లు జరిగేటప్పుడు, ఇంకా రోడ్డు ప్రమాదాల్లో గాయపడినప్పుడు ప్రాణాలు నిలబడాలంటే అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. అయితే దురదృష్టవశాత్తు రక్తదానంపై ఇంకా అపోహలున్నాయి. వాస్తవానికి రక్తం దానం చేయడం వల్ల ఒకరి జీవితాన్ని కాపాడిన వారవుతారు. అంతే కాకుండా దానం చేసిన వ్యక్తి ఆరోగ్యానికి ఎంతోమేలు జరుగుతుందని వైద్య నిపుణులు చెప్పే మాట. అనేక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని, మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని చెబుతున్నారు. శరీరంలో మోతాదుకు మించి ఐరన్ ఉంటే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. రక్తదానం చేయడంతో ఈ పరిస్థితి తగ్గడమే కాకుండా క్యాన్సర్ లాంటి రిస్క్ తగ్గుతుంది. బరువు తగ్గొచ్చు. ఒక వ్యక్తి రక్తదానం చేస్తే తిరిగి మూడు నెలల తర్వాత మళ్లీ కూడా చేయొచ్చు. అందువల్ల ప్రజలు అపోహలు వీడాలి.

దాతలకు వందనం

ఒక మనిషి సకాలంలో చేసే రక్తదానం నిండు ప్రాణాన్ని కాపాడుతుంది. పలు సందర్భాల్లో తల్లి, శిశువు ఇద్దరి ప్రాణాలు దక్కుతాయి. ఈ విషయాన్ని గమనించిన నెల్లూరు జిల్లాలో పలువురు స్వచ్ఛంద రక్తదాతలుగా మారారు. మరి కొంతమంది రక్తదాన మోటివేటర్లుగా ఉంటూ పలువురి చేత దానం చేయిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న బ్లడ్‌బ్యాంక్ రోగుల అవసరాలను తీర్చడంలో ముందుంది. అలాగే నారాయణ, అపోలో, కిమ్స్ హాస్పిటల్స్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, నోవా బ్లడ్‌బ్యాంక్‌లు రక్తం అందిస్తూ తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నాయి.



నెల్లూరులోని రెడ్‌క్రాస్ భవనం

నేడు

బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఎక్కువసార్లు రక్తం దానం చేసిన వారిని, బ్లడ్‌క్యాంప్‌లు జరిపిన వారిని రెడ్‌క్రాస్ కార్యాలయంలో కలెక్టర్ సన్మానించనున్నారు. అలాగే ర్యాలీలను నిర్వహిస్తారు.

వేలాది మంది

రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో ప్రతి సంవత్సరం 17 నుంచి 20 వేల మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. ఒకరి రక్తాన్ని మూడు రకాల కాంపోనెంట్లుగా (హోల్‌బ్లడ్, ప్యాకెట్ సెల్స్, ప్లేట్‌లెట్స్) విభజించి ముగ్గురికి ప్రాణదానం చేయొచ్చు. ఇలా రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ద్వారా అవసరమైన కాంపోనెంట్లు ఎక్కించడం ద్వారా సంవత్సరానికి సుమారు 50 వేల మంది ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. మిగతా బ్లడ్ బ్యాంక్ ద్వారా మరో 25 వేల మంది రోగుల ప్రాణాలను నిలబెడుతున్నారు.

సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్లకు సన్నాహాలు

- జేసీ ఆర్.కూర్మనాథ్



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో త్వరలో సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. నెల్లూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్లను మొదలు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. రెండో విడత భూ సర్వే 127 గ్రామాల్లో పక్కాగా జరుగుతోందన్నారు. ఇందుకు సంబంధించి 32 గ్రామాల్లో బీఎల్ఆర్ పూర్తయిందన్నారు. జిల్లాస్థాయి అధికారులు వారంలో రెండు, మండల స్థాయి అధికారులు వారంలో నాలుగు సచివాలయాలను తనిఖీలు చేసి సమగ్ర నివేదికను ఇవ్వాలని సూచించామన్నారు. సిబ్బంది పనితీరు, పథకాల అమలు, జగనన్నకు చెబుదాం అర్జీల పరిశీలన ఇలా అన్నింటిని గురించి ఆరా తీస్తున్నారన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఇటీవల ఓ వ్యక్తి తల్లిదండ్రుల ఆస్తి పంపకాల సమస్యను సక్రమంగా పరిష్కరించలేదంటూ చెప్పడంతో వెంటనే విచారించి న్యాయం చేయడం జరిగిందన్నారు. చాలా సమస్యలను ఇప్పటికే పరిష్కరించామన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	172
లేయర్ (లైవ్) :	105
బ్రాయిలర్ చికెన్ :	290
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	320
లేయర్ చికెన్ :	178

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- జేసీ కూర్మనాథ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ

నెల్లూరు(దర్గామిట్ట): రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరించేలా చొరవ చూపాలని జేసీ రోణంకి కూర్మనాథ్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్ నుంచి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డివిజన్ల వారీగా చుక్కల భూములు, రీ సర్వే, ఇంటి స్థలాలు తదితర సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చుక్కల భూముల అర్జీలు పరిష్కారమయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీకి సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు అందరికీ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, ఏడీ సర్వే అన్నవరం హనుమాన్ ప్రసాద్, ఆర్డీఓలు శీనానాయక్, మలోల, కరుణకుమారి పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.38
సన్నవి : రూ.25
పండ్లు : రూ.10

డిగ్రీ పరీక్షల్లో 16 మంది డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది విద్యార్థులను డిబార్ చేశారని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 10,891 మంది విద్యార్థులకు గానూ 10,143 మంది హాజరయ్యారని తెలియజేశారు. విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షకు 612 మందికి గానూ 527 మంది హాజరయ్యారని, నెల్లూరు నగరంలోని వీఆర్ ఐఎస్ కళాశాలలో తొమ్మిది మంది, సూళ్లూరుపేటలోని ఎస్‌వీఎస్ఎస్‌సీ కళాశాలలో ఒకరిని డిబార్ చేసినట్లు తెలియజేశారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం నేడు

వెంకటాచలం: వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కో-ఆర్డినేటర్ జనార్దనరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఈ శిబిరాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారన్నారు. గుండె, నరాలు, కీళ్లు, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వైద్య నిపుణులు పరీక్షించి వైద్య సేవలందిస్తారని తెలియజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న సురేంద్రబాబు

నెల్లూరు సిటీ: హత్యాయత్నం కేసులో ఇద్దరు వ్యక్తులను నెల్లూరు చిన్నబజారు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు విలేకరులకు వివరాలు వెల్లడించారు. నెల్లూరులోని కోటమిట్టలో షేక్ రబ్బానీ నివాసం ఉంటున్నాడు. ఈనెల 12వ తేదీన అతను బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి రాత్రి మన్సూర్‌నగర్ రెండో వీధిలో వస్తుండగా అదే ప్రాంతానికి చెందిన షేక్ మహమ్మద్, షేక్ మున్నా అడ్డగించారు. పాతకక్షల నేపథ్యంలో కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించడంతో నిందితులు పరారయ్యారు. రబ్బానీ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మంగళవారం సాయంత్రం మన్సూర్‌నగర్ ఆర్చి వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని కత్తిని స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరిచారు. ఇన్‌స్పెక్టర్, ఎస్సై సైదులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.